క్లుప్తంగా

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

కమాన్‌పూర్: మండలంలోని గొల్లపల్లె,సిద్దిపల్లె గ్రామాల్లో రైతులకు భూసార పరీక్షలపై రామగిరి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ అవగాహన కల్పించారు. ప్రతీ రైతు సాగుకు ముందు తన పొలంలోని మట్టిని పరీక్ష కేంద్రాలకు పంపించి పరీక్షించుకున్న తర్వాతే అధికారుల సూచనలతో పంట సాగుచేయాలన్నారు. రైతులకు మట్టి నమూనా సేకరణ కోసం బ్యాగులు అందించారు. శాస్త్రవేత్తలు అర్చన పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ధర్మారం: మండలకేంద్రంలో అలయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఇంటర్నేషనల్ జాయింట్ ట్రెజరర్ బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి సయుక్తంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో 126 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్, అలయన్స్‌క్లబ్ ఆఫ్ అచీవర్స్ అధ్యక్షుడు కోరుకంటి స్వామి, కార్యదర్శులు మామిడిశెట్టి శ్రీనివాస్, ఇరుకుల్లా సంతోష్, కోశాధికారి ఎలిగేటి మహేందర్, బైరి చంద్రమౌళి, తోడేటి మురళి, అమరపెల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీర్ వెరిఫికేషన్ అధికారుల బృందం పర్యటన


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండలంలోని చీమల పేటలో స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం మండల స్థాయి పీర్ అధికారుల బృందం 2023లో సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, కంపోస్ట్ ఎరువుల తయారీ, శ్మశానవాటిక నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం నివేదికను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తొంటి పద్మ బుచ్చన్న, ఏపీఎం సదానందం, కార్యదర్శి పున్నమయ్య, సీసీశ్రీధర్, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఈ శంకర్

రామగుండం: అంతర్గాం మండలకేంద్రంలోని ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈడీ రాజ్‌కుమార్, ఏఈ ఏ.శంకర్ విద్యుత్ వినియోగదారులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతర్గాం మండల విద్యుత్ ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు హాజరయ్యారు.

ధూళికట్టలో బుద్ధ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కావేరి

ఎలిగేడు: ధూళికట్టలో ఊరచెరువుకట్ట మీద గౌతమబుద్ధుని విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం సర్పంచ్ గొల్లె కావేరి భూమిపూజ చేశారు. గత చరిత్ర వైభవాలు భావితరాలకు గుర్తుండేలా బుద్ధవిగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, ఉపసర్పంచ్ గొరెల్లి మధుసూదన్‌రావు, రైతు సమన్వయసమితి మండల కన్వీనర్ నరినేని సుధాకర్‌రావు, వార్డుసభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

- అరచేతిలో ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు
- కనిపించని సూచికబోర్డులు
- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు


కొలనూర్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే రహదారిపై శిథిలావస్థలో కనిపిస్తున్న కల్వర్టు


ప్రమాదకరంగా మారిన ఓదెల ఎస్సారెస్పీ కల్వర్టు


ప్రమాదకరంగా మారిన హరిపురం కల్వర్టు

ఓదెల: మండలంలో ప్రమాదరకంగా మారిన కల్వర్టులతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. కొలనూర్ నుంచి హరిపురం వెళ్లే దారిలో ఓదెల ఎస్సారెస్పీ చిన్నకాలువ మూలమలుపు కల్వర్టు, కొలనూర్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే దారిలో, పొత్కపల్లి నుంచి శానగొండకు వెళ్లే దారిలోని కల్వర్టులన్నీ ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ఇంటివరకు వెళతారో లేదోననే గ్యారంటీ లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆయా గ్రామాల మీదుగా తారురోడ్లు ఉన్నప్పటికీ ఇరువైపులా కల్వర్టులకు సైడ్‌బర్మ్‌లు నిర్మించకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొలనూర్ నుంచి ఓదెలకు వెళ్లే దారిలో హరిపురం వద్ద కల్వర్టు లేకపోవడంతో పలుమార్లు కార్లు పల్టీ కొట్టి 10 మందికిపైగా ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. భారీవర్షాలకు కొలనూర్ గ్రామశివారులో తారు రోడ్డు కల్వర్టు వద్ద కోతపడడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిచి రాత్రిపూట వాహనాల్లో బైక్‌లపై ప్రయాణిస్తే అంతే సంగతులని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఓదెల మండలంలో చుట్టూ 22 గ్రామాలకు తారురోడ్లు జిల్లా కేంద్రానికి లింక్‌రోడ్లు ఉన్నప్పటికీ కల్వర్టులు లేకపోవడంతో సౌకర్యంవంతంగా ప్రయాణించలేకపోతున్నారు. ప్రమాదకరంగా మారిన కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

హరిపురం కల్వర్టు పూర్తిచేయాలి



హరిపురం కల్వర్టు పనులు పూర్తిచేయాలి. రోడ్డువేసి కల్వర్టు నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డువేసిన కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మించకుండా వదిలేశాడు. వెంటనే కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి కల్వర్టు నిర్మించి ప్రమాదాలను నియంత్రించాలి.
– గ్యారవేని నాగరాజు, ఉపసర్పంచ్, హరిపురం

మూలమలుపు వద్ద ప్రమాదాలు



ఓదెల నుంచి కొలనూర్‌కు వచ్చేటప్పుడు హరిపురం మూలమలపు ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదాలు జరగుతున్నాయి. రోడ్డు నిర్మించినప్పటికీ కల్వర్టు నిర్మించకుండా వదిలేశారు. వెంటనే కల్వర్టు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.
– కొల్లూరి బలరాం, ప్రయాణికుడు, కొలనూర్,

కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు

కొలనూర్ నుంచి హరిపురం గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. పంచాయతీరాజ్ శాఖ నుంచి బదిలీచేశారు. మిగతా రోడ్లకు ఇరువైపులా సైడ్‌బర్మ్‌ల మరమ్మతులకు కొత్త కల్వర్టుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.
– శ్రీనివాస్‌చారి, ఈఈ, ఆర్‌అండ్‌బీశాఖ

సీఎం కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ


హనుమాన్ చాలీసా పఠిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖనిటౌన్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు మహర్దశ కలిగిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక కోదండ రామాలయంలో హనుమాన్ భక్తులకు నిత్యాన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చందర్ పాల్గొని మాట్లాడారు. రాబోయే కాలంలో హనుమాన్ దీక్షా.దారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కోదండ రామాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చందర్‌ను స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి సీతారాముల పట్టాభిషేకం చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు అడ్డాల గట్టయ్య, పెంట రాజేశ్, యువజన సంఘాల నాయకులు దొమ్మేటి వాసు పాల్గొన్నారు.

ఘనంగా రామారావు వర్ధంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: అరుణోదయ రామారావు 4వ వర్ధంతి సభను శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, నాగన్న, దాస్, అశోక్, ఉదయగిరి, ఎస్‌కే అబ్దుల్, కృష్ణ, నరేశ్, మల్లన్న, జ్యోతి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరుగుపేరిట దోచుకుంటే ఊరుకోం


పన్నూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

కమాన్‌పూర్: ధాన్యంలో తేమశాతం ఉందనే సాకుతో తరుగుపేరిట రైతులను దోచుకుంటే ఊరుకోమని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. రామగిరి మండలంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ తేమశాతం పేరుతో కొనుగోలు చేయడం లేదని దీంతో ఆకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని మండిపడ్డారు. తేమశాతం ఉన్నా లేకున్నా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సహకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోతే రైతుల పక్షాణ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సునీల్‌రెడ్డి వెంట నాయకులు ముల్కూరి శ్రీనివాస్, తొట్ల రాజు, కుంట చక్రి, జానీభాయ్, ఉదరి కొమురయ్య, రేణికుంట్ల విజయ్, నరేశ్ తదితరులున్నారు.

'లయన్స్ క్లబ్' అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

జ్యోతినగర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులోని ఆటో యూనియన్ ఎదుట పేదలకు ఉచిత అన్నదానం చేశారు. లయన్స్ బేబి గోపాల్ త్రివేది సతీమణి అన్నపూర్ణ పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. అధ్యక్షుడు రాజేందర్, బంక రామస్వామి, గంగాధర్, వంకరయ్య పాల్గొన్నారు.

పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: అకాలవర్షాలతో అతలాకుతలమై ఆర్థికంగా చితికిపోయిన అన్నదాతలకు ఎకరాకు రూ.20వేలు పరిహారం అందించి ఆదుకోవాలని రైతుసాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముడిమడుగుల మల్లన్న, ఎరుకల రాజన్న డిమాండ్ చేశారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల బాధలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. రైతులు శ్రమించినా నష్టాలపాలవుతున్నారని, వారి శ్రమను పాలకులు గుర్తించడం లేదన్నారు. గ్రామానికి చెందిన రైతులు కేంద్రాల్లో రోజులతరబడి నిరీక్షిస్తున్నా పట్టించుకున్న వారేలేరని వాపోయారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సింధూజ

ఎలిగేడు: మండలంకేంద్రంలో శ్రీమంజూనాథ గ్రామసంఘం సెర్ప్ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సింధూజ, మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీఎం సుధాకర్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

'కంటివెలుగు'లో 156 మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామంలో నిర్వహిస్తున్న 'కంటివెలుగు'లో భాగంగా శుక్రవారం 156 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా 15 మందికి కంటిఅద్దాలు పంపిణీచేశారు. సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, ఎంపీటీసీ ఎల్లవ్వ, ఉపసర్పంచ్ చీకటి శైలజ, వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, క్యాంపు వైద్యాధికారి స్వప్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో నివసిస్తున్న గుగులత్ సుజాత (32), చిన్న కూతురు దివ్య (18నెలలు) శుక్రవారం కనిపించడం లేదని భర్త గుగులత్ రవినాయక్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆకస్మిక తనిఖీ

ఓదెల: మండలంలోని కొలనూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకును కరీంనగర్ ఆర్ఎం లక్ష్మణ్ శుక్రవారం తనిఖీచేశారు. బ్యాంకు పరిధిలోని లావాదేవీల వివరాలు, రుణాల మంజూరు, రికవరీ లోన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు కస్టమర్లతో సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందని ఆర్ఎం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

నేడు సర్వసభ్య సమావేశం

ఓదెల: ఓదెల మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండలపరిషత్ కార్యాలయంలో ఓదెల ఎంపీపీ కునారపు రేణుకాదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఓదెల ఎంపీడీవో జి. సత్తయ్య తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బీరన్న దర్వాజ ప్రతిష్ఠ



జూలపల్లి: జూలపల్లిలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీరన్న–మహంకాళి ఆలయ దర్వాజ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ నర్సింహయాదవ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టాల మల్లేశం, శ్రీనివాస్, శంకర్, ఒగ్గు మల్లేశం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా పసుపు కొమ్ముల అర్చన


పూజలు చేస్తున్న భక్తులు

జ్యోతినగర్: దుర్గామాత ఆలయంలో లక్ష పసుపు కొమ్ములతో అర్చన ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం భరత్‌నగర్ ప్రాంతంలోని దుర్గామాత ఆలయంలో 41 రోజుల పూజల అనంతరం కుందారపు లక్ష్మీ–మల్లేశ్ ఆధ్వర్యంలో లక్ష పసుపు కొమ్ములతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు రాజగోపాలచారి శాస్త్రోక్తంగా పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం


రథోత్సవం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ధర్మారం: మండలంలోని పత్తిపాక గ్రామం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం పూజాకార్యక్రమాల అనంతరం రథాన్ని ఆలయంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. రథంవెంట భక్తులు పరుగులు తీస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, సర్పంచ్ బద్దం సుజాత, ఎంపీటీసీ బద్ద అజయ్‌పాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా ధోపోత్సవం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి తిరుక్కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ధోపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం, సాయంత్రం హోమం, బలిహరణం, వసంతపూజ, అశ్వసేవ వంటి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు కొండపాక రామాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి కార్యదర్శుల నిరసన


బతుకమ్మ ఆడుతున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు శుక్రవారం 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పెద్దపల్లి అమరవీరుల స్థూపం వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు మద్దతు..

కమాన్‌పూర్: రామగిరి మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. ప్రభుత్వం కార్యదర్శులను పర్మినెంట్ చేసి పేస్కేల్ సవరించాలని డిమాండ్ చేశారు.

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మారం: జీపీ కార్మికులకు జీవో ప్రకారం ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకుడు రవీందర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. మేడే సందర్భంగా జీపీ కార్మికులకు రూ.వెయ్యిపెంచుతున్నట్లు సీఎం ప్రకటించడం సరికాదన్నారు. జీవో 60 ప్రకారం ప్రతీ కార్మికుడికి నెలకు రూ.15,600లు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికసంఘం మండల అధ్యక్షుడు ఆకుల రాజయ్య, నాయకులు మల్లేశం, లక్ష్మి, శంకరమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం రోడ్డు పక్కనే పడిగాపులు

- అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణికులు
- బస్ షెల్టర్ నిర్మించాలని డిమాండ్


రోడ్డు పక్కన షాపుల ఎదుట నిలబడిన ప్రయాణికులు

రామగుండం: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అంతర్గాం మండలకేంద్రంలో ఆర్టీసీ సంస్థ కనీసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మండలకేంద్రం నుంచి రామగుండం వైపు వచ్చే ప్రయాణికులు, పొట్యాల, ధర్మారం, ముర్మూర్ వైపు వెళ్లే ఆర్టీసీ ప్రయాణికులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ఎదుట బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని గంటల తరబడి ఎండలో బస్సుల కోసం నిల్చొని వేచిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి సదరు షాపు యజమాని షాపుకు అడ్డుగా ఉన్నారంటూ ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ సంస్థ స్పందించి మండలకేంద్రంలో కనీసం బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి!


ప్రమాదకరంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి

కమాన్‌పూర్: మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ మీదుగా మండలకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. డబుల్ రోడ్డు విస్తరించిన నేపథ్యంలో నాసిరకం పనులతో రోడ్డుకు ఇరువైపులా విస్తరించిన రోడ్డు కిందికి కుంగడంతో రహదారిపై వెళ్లే బైకులు ప్రమాదాలకు గురవుతున్నాయి.